ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు

- అధికమైన దోమల బెడద
- పొంచిఉన్న విష పురుగుల ప్రమాదం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని ఏకశిల స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. దాంతో విష పురుగులు, దోమల బెడద అధికమైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలతో రాత్రీ పగలు అనేక తేడాలేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రాత్రి వేళల్లో విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని యజమానులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దోమల నివారణకు ఇంతవరకు ఫాగింగ్ చేయలేదని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


46వ డివిజన్‌లో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు


ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు

క్లుప్తంగా

కాళేశ్వర్‌రావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు ఎంవీ.కాళేశ్వర్‌రావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ ది అగ్రికల్చరల్ ఇండిపెడెన్స్ ఆఫ్ ట్రైబల్ ఫార్మర్స్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టూ ఐటీడీఏ భద్రాచలం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కాళేశ్వర్ రావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.కనకాచారి పర్యవేక్షణలో కాళేశ్వర్ రావు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆర్థిక సాయం అందజేత



వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో నిమ్మకాయల వ్యాపారి వెంకం రాజు ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందారు. కాగా, బాధిత కుటుంబానికి తెలంగాణ పాదుపు, మార్కెటింగ్ సహాయ సహకార సంఘం తరఫున రూ.30వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ, రాజు, అలీ, సూరయ్య, పాపని భాస్కర్, మురళి, శేఖర్, రంజిత్, నగేష్, సర్వర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి నవరాత్రోత్సవాలు



మడికొండ: నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక వాల్మీకి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినుగు రాంచందర్ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం వాల్మీకి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం కులపెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు విందు భోజనం



కాజీపేట: మొట్టమొదటి సారిగా రెస్టారెంట్‌లో అడుగిడిన అనాథ పిల్లల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అమెరికాలో స్థిరపడిన అభిషేక్, శ్రావ్య కుమారుడు ఆవ్యాన్ మొదటి పుట్టిన రోజు వేడుకలను ఒయాసిస్ ఆశ్రమంలో అనాథ పిల్లల మధ్య ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో దాదాపు 50 మంది పిల్లలకు విందు భోజనం చేయించారు. ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్, సేవా సమితి అధ్యక్షుడు మండువ సంతోష్, కోడం వినయ్, సాయికిరణ్, మండల రవీందర్ రెడ్డి, భరత్, ఆశ్రమ ఇన్‌చార్జ్ ఒద్దిరాజ్ చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

కొండేటి శ్రీధర్‌ను గెలిపించాలని ప్రచారం

మడికొండ: బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మడికొండలోని 91వ బూత్ పరిధిలో నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పొనగోటి వెంకట్‌రావు, కందుకూరి బాలరాజు, 46వ డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్, వెంకటేష్, కిరణ్, మహేందర్, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

హసన్‌పర్తి: నగరంలోని రెండవ డివిజన్ గుండ్ల సింగారానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కొండేటి శ్రీధర్ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు అజయ్, దినేష్, విజయ్, రాజు, తిరుపతి, సారయ్య, వెంకన్న, రాము పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు

వరంగల్: ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న అంబి పోశాలు, పల్లకొండ సాంబరాజు, కొప్పుల అనిల్, చక్రవర్తుల శ్రీనివాస్, నెక్కమల్ల వెంకటేష్, గనిపాక సుధాకర్, గన్నారపు ప్రవీణ్, మిట్టపల్లి కృష్ణ, వనం రఘును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.29,740ల నగదు, 7 మొబైల్ ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కేసు నిమిత్తం నిందితులను ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. దాడుల్లో సీఐ రాంబాబు, ఎస్సై శరత్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమంలో ‘దాశరథి’ పాత్ర కీలకం


దాశరథికి నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

హన్మకొండ: తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ కవి, గొప్ప సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్యులు పాత్ర కీలకమైందని బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. హనుమకొండ హనుమాన్‌నగర్-1లో దాశరథి కృష్ణమాచార్యులు 36వ వర్ధంతిని ఆదివారం జరుపుకున్నారు. ముందుగా దాశరథి చిత్రపటానికి కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ‘నా తెలంగాణ కోటి రతనాల వీణా’ అంటూ తన రచనలతో తెలంగాణ అస్తిత్వపు భావజాలాన్ని నలుదిశలా చాటిన సాహితీ దిగ్గజం, మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని కొనియాడారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, శ్రీనివాస్, కుమార్ రెడ్డి, మాదారపు ఉదయ్ కిరణ్, సిరిమల్లె రాజయ్య, చిర్ర శ్రవణ్, రాజయ్య, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, రాజేందర్, నవీన్ పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం



హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా మార్కాల యాదిరెడ్డి, కామిడి సతీష్‌రెడ్డి, అధ్యక్షుడిగా వల్లాల రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా సార్ల రమేష్, కోశాధికారిగా కొల్లూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కట్కూరి సంజీవరెడ్డి, పాడియ అమ్రుసింగ్, సహాయ కార్యదర్శిగా వనపర్తి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో ఆటో అడ్డా నేతలు, ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు, జెండా పండగను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈద్గా అధ్యక్షుడు, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ పాల్గొని గ్యార్మీ షరీఫ్ జెండా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వందలాది మంది ముస్లింలు భక్తిభావంతో అల్లాను గుర్తుచేసుకుంటూ శివనగర్‌లో గ్యార్మీ జెండాను ఊరేగించారు. ఆ తర్వాత జెండాను గద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, మత పెద్దలతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని జబ్బార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మహ్మద్ శౌకత్, రఫీక్, జానీ, ఎండీ.యాకూబ్, హసన్, గౌస్, ఇంతియాజ్, హైమద్‌పాషా, అమ్జద్ తదితరులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న జబ్బార్

ఆత్మగౌరవ సభకు తరలిన ఎరుకలు



వరంగల్: హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఎరుకల ఆత్మగౌరవ సభకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతిరి రాజశేఖర్, పల్లకొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎరుకల కులస్తులు ఆదివారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, నాయకులు రంజిత్‌కుమార్, దుగ్యాల రాము, పల్లకొండ యాదగిరి ఓనీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి


అమౌన్న కార్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

కాజీపేట: రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని గోవా ఎమ్మెల్యే సంకల్ప్ అమౌన్న కార్ అన్నారు. కాజీపేట పట్టణంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి రావు పద్మను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మొట్టమొదటి సారిగా కాజీపేట ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే సంకల్ప్ అమౌన్న కార్‌ను కార్యకర్తలు సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్‌గౌడ్, భగవాన్ దాస్ ఉపాధ్యాయ, జీవన్ ప్రకాష్, తిలక్ కుమార్, కరుణాకర్, కాసీం పాల్గొన్నారు.

దాస్యం కుటుంబానిది 4 దశాబ్దాల అనుబంధం



కాజీపేట: కాజీపేట ప్రాంతంతో దాస్యం కుటుంబానికి దాదాపుగా 4దశాబ్దాలుగా విడదీయరాని అనుబంధం ఉందని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. 62వ డివిజన్ సోమిడి గ్రామంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి విజయ్‌భాస్కర్ ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, కాటపురం రాజు, సుంచు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, గాయకులు

హన్మకొండ కల్చరల్: కరోకే క్లబ్ ఆధ్వర్యంలో నూతన గాయనీ గాయకులను పరిచయం చేస్తూ కాజీపేటలోని సిద్ధార్థనగర్‌లో లెట్స్ సింగ్ టుగెథర్ కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సస్కూల్ ప్రొడక్షన్ అధ్యక్షుడు సన్నీ పుల్ల నేతృత్వంలో జరిగిన సంగీత విభావరి కార్యక్రమం అలరించింది. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఎస్సై రావెళ్ల రామారావు, గాయనీ, గాయకులు రాజు, జాస్‌పాల్ సింగ్, విజయ్‌కుమార్, రవికుమార్, నాగేందర్, రామనర్సింహ స్వామి, సుధాకర్, రామ్మూర్తి, రమ, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, గిటార్ ప్లేయర్ కందుల పాండు, జాఫర్, జగన్నాథ చార్యులు, సాగంటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన బీజేపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముదుసు నర్సింహ, కేతిరి రాజశేఖర్, పసులాది మల్లయ్య, ఆడెపు అనిల్‌కుమార్, అశోక్, హైమావతి, స్టాలిన్, సునీత, క్యాకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన బీజేపీ నేత కొప్పుల క్రాంతి.. పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నరేందర్ సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, ఉమ, నాయకులు దామోదర్, బోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

కాజీపేట: కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాజీపేట పట్టణంలో కార్యకర్తలు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలపై ప్రజలకు భరోసా కల్పిస్తూ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ.అంకూస్, గుంటి కుమారస్వామి, అరూరి సాంబయ్య, భరత్, కాసు ఇన్నారెడ్డి, కొండా శివ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గకు చెందిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు భూక్య మోతీలాల్ నాయక్.. తన అనుచరులతో కలిసి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి కాంగ్రెస్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.


పార్టీలో చేరిన వారితో కొండా సురేఖ, మురళి

ధర్మారెడ్డితోనే యువతకు ఉపాధి

మామునూరు: యువతకు ఉపాధి చల్లా ధర్మారెడ్డితోనే సాధ్యమని ఆదర్శనగర్ యూత్ విభాగం నేత పసునూరి ప్రవీణ్ (టోనీ), ఆదర్శనగర్ ఇన్‌చార్జ్ తరగల ప్రసాద్ అన్నారు. వరంగల్ 17వ డివిజన్ ఆదర్శనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హనుమాన్ల రంజిత్‌రెడ్డి, సుంకు శ్రీకాంత్, ఎస్‌కే.గౌస్, కాసర్ల సందీప్, రాకేష్, సురేష్, సమీర్, సాయి, రియాజ్, ఇర్ఫాన్, విజయ్ పాల్గొన్నారు.

గోదాముల్లో ఎక్సైజ్ తనిఖీలు



కాజీపేట అర్బన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం నిల్వలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రామకృష్ణ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ఎక్సైజ్ పరిధిలోని హసన్‌పర్తి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని రైస్ మిల్లులు, కోళ్ల ఫారాల గోదాములను ఆదివారం తనిఖీ చేశారు. అక్రమ మద్యం నిల్వలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 18004252523, హనుమకొండ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ 87126 59029 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసం చేయడంతో సింహం గుర్తుపై పోటీ

కాజీపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన మోసాన్ని జీర్ణించుకోలేక ప్రజల ఆకాంక్ష మేరకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రకటించారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుచరవర్గం, కార్యకర్తలనుద్దేశించి జంగా మాట్లాడుతూ అధిష్టాన వర్గంగా చెప్పుకునే నాయకులు గ్రూప్‌లుగా విడిపోయి ఓ అసమర్థుడైన నాయకుడికి టికెట్ ఇవ్వడం అత్యంత బాధాకరమని వాపోయారు. ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ పార్టీలోనే చేరుతానని, చచ్చేంత వరకు కాంగ్రెస్ పార్టీని వీడేదిలేదని స్పష్టం చేవారు. కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకునే జంగా రాఘవరెడ్డి గెలుపు కోసం కష్టించి పని చేయాలని సూచించారు. మాజీ కార్పొరేటర్లు తొట్ల రాజు యాదవ్, మద్దెల శోభారాణి, సందెల విజయ్‌కుమార్, బండి రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

అవినీతి బీఆర్ఎస్‌ను తరిమికొట్టాలి


ప్రచార సభలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

ఖిలా వరంగల్: ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ప్రజలను మరోసారి మోసం చేయాలని వస్తున్న బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో సంగరబోయిన చందర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో దేవాదుల ప్రాజెక్ట్ నుంచి తాగు, సాగునీరు అందజేసినట్లు గుర్తుచేశారు. స్వరాష్ట్ర ఏర్పాటు, ప్రజల కలలను సాకారం చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కొండా సురేఖ.. ఎమ్మెల్యే పనిచేసిన ఐదేళ్లలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసినట్లు వివరించారు. ప్రజా సేవ చేసేందుకు మళ్లీ వచ్చిన సురేఖను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం సంగరబోయిన చందర్‌తోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి మురళి ఆహ్వానించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, బోయిని దూడయ్య, బెడిదె వీరన్న, గజ్జెల శ్యాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి ప్రచారం

కాజీపేట రూరల్: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం ఆయన సతీమణి దాస్యం రేవతి ఆదివారం ప్రచారం నిర్వహించారు. కాజీపేట 47వ డివిజన్‌లోని 150, 151, 152వ బూత్‌ల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. బాపూజీనగర్ పోచమ్మగుడి, ఇంపీరియల్ కాలనీ, బాలాజీ నగర్‌లో పాదయాత్ర చేస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, డివిజన్ ఇన్‌చార్జ్ దశరథం, నాయకులు దువ్వ కనకరాజ్, నార్లగిరి రమేష్, మర్యాల కృష్ణ, పోతుల సాంబయ్య, సిరిమల్ల దశరథం, తండమల్ల వేణు, గబ్బెట శ్రీనివాస్, కొండ్ర శంకర్, కొత్త రవి, పసునూరి మనోహర్, నయీం జుబేర్, మైలారం శంకర్, బొట్టు రాజు, భద్రయ్య, రాబర్ట్‌సెల్వ, పూర్ణిమ, శ్రీకాంత్, కార్తీక్, రాజ్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


రేవతికి స్వాగతం పలుకుతున్న నాయకులు

అధిక ఫీజులను నియంత్రించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

విద్యారణ్యపురి: హనుమకొండ నగరంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులను నియంత్రించి, అలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఎలాంటి అనుమతులు లేకున్నా నడుస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయపై సంబంధిత అధికారులకు విన్నవించినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా స్పందించడం లేదని శ్రీకాంత్ విమర్శించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, నవ్య, సంధ్య, ప్రవళిక, అనూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

‘ఐఓబీ’లో విజిలెన్స్ వారోత్సవాలు

హన్మకొండ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఆదివారం ఉదయం వాకథాన్ నిర్వహించారు. ఐఓబీ ప్రాంతీయ కార్యాలయం వద్ద వాకథాన్ కార్యక్రమాన్ని ఐఓబీ రీజినల్ మేనేజర్ నారాయణప్రసాద్ నాయక్ ప్రారంభించగా, ఐఓబీ పలు బ్రాంచుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణప్రసాద్ మాట్లాడుతూ అవినీతిపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన ఉంటే అవినీతి రహిత భారతాన్ని నిర్మించుకోవచ్చని అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచనల మేరకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ‘అవినీతికి స్వస్తి చెబుదాం.. జాతి సేవకు అంకితం అవుదాం’ అనే నినాదంతో మూడు నెలలుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు ఫర్వేజ్, సంతోష్ కుమార్, కల్యాణ సుందరం, సీనియర్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


వాకథాన్ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

విశ్వరూప సభను జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11న నిర్వహించనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని మంద కృష్ణమాదిగ స్థాపించి 28 ఏళ్లుగా ఎస్సీల వర్గీకరణకు ఆయన అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ వడ్డెపల్లి మధు, బాధ్యులు రమేష్, సంపత్, కొడెపాక కిరణ్, రాజు, అనిల్, సునీల్, అరుణ్, కిరణ్ పాల్గొన్నారు.